

'పరీక్షా పే చర్చ'ను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి- రాయచోటి

పరీక్షా పే చర్చ-2025 కార్యక్రమాన్ని విజయవంతానికి జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎంఆర్ఎస్ అజయ్‌కుమార్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఈ కార్యక్రమంలో నమోదు చేయాలన్నారు. పరీక్షా పే చర్చా-2025 కార్యక్రమం, విద్యాపరమైన సవాళ్లకు వినూత్న పరిష్కారాలను చర్చించడానికి, స్ఫూర్తిదాయకమైన కథనాలను పంచుకోవడానికి దేశవ్యాప్తంగా పాల్గొనే వారిని ఎంపిక చేసి ఈ ఈవెంట్‌లో ప్రశ్నలు అడగడానికి, ప్రధానమంత్రితో నేరుగా ఇంటరాక్ట్ అవుతారన్నారు. ఆసక్తిగల వ్యక్తులు www.mygov.inలో అధికారిక పోర్టల్‌ను సందర్శించి నమోదు చేసుకోవచ్చన్నారు.

సందర్శన కాదు.. స్థిరీకరణ కావాలి

రాయలసీమకే తలమానికమైన ప్రాజెక్టు గండికోట, ఇటువంటి ప్రాజెక్టును సందర్శించడంతో సరిపెట్టడం కాదు.. స్థిరీకరణ పనులకు అవసరమైన నిధులు కేటాయించాలి. అనుబంధ రిజర్వాయర్లకు సంబంధించిన సప్లయ్‌ఛానళ్లు, ఉప కాల్వల నిర్మాణ పనులపై దృష్టి సారించాలి. జిల్లాలోని సర్వరాయసాగర్, వామికొండ, సిబిఆర్, పిబిసి, మైలవరం, వెలిగల్లు, ఝరికోన, అన్నమయ్య ప్రాజెక్టుల సప్లయ్ ఛానళ్ల పరిస్థితి అయోమయంగా మారింది. గండికోట, సోలార్ నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో మీనమేషాలు లెక్కిస్తోంది. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో కథనం...

గండికోట నిర్వాసితుల ఎదురుచూపులు

గండికోట, సర్వరాయసాగర్, వామికొండ, పిబిసికి సప్లయ్ ఛానల్లేవీ


నేడు జిల్లాకు నీటిపారుదల శాఖ మంత్రి రాక

పెండింగ్‌లో ఉన్న జిఎన్ఎస్ఎస్ టన్నెల్ పనులు



ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లా సాగునీటిపారుదల రంగానికి బడ్జెట్‌లో రూ.3,848 కోట్లు కేటాయించారు. జిఎన్ఎస్ఎస్‌కు రూ.2,254 కోట్లు కేటాయించారు.. మూడు నెలల వ్యవధిలో నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకూ పైగా ఖర్చు చేసిన దాఖలాల్లేవు. గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత వైసిపి సర్కారు హయాంలో



అన్నమయ్య ప్రాజెక్టు (ఫైల్‌ఫోటో)

చేపట్టిన ప్రాజెక్టు పనులపై శూలశోదన చేయడం తప్పా, నిర్మాణాత్మక పురోగతి సాధిద్దామనే ఆలోచన కొరవడింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు పూర్తి చేస్తే 2.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. చిత్తూరు జిల్లాలో 1.5 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో 1.2 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 1,150 ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుంది. ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుకు ఫారెస్టు క్లియరెన్స్ సమస్య పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఫేజ్-1లోని కీలకమైన అవుకు టన్నెల్ పనులు ఎంతో వ్యయప్రయాసల మధ్య పూర్తి చేసింది. మిగిలిన టన్నెల్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అవుకు టన్నెళ్లకు పూర్తి చేయక పోవడం వల్ల కృష్ణాజలాల వాటాకు కోత పడుతోంది. ఫలితంగా కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన సుమారు 2.5 లక్షల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. సర్వరాయసాగర్ డిస్ట్రిబ్యూటరీలు, సాగుకాల్వల నిర్మాణానికి రూ.40 కోట్ల నిధులు అవసరమని తెలుస్తోంది. వామికొండ రిజర్వాయర్‌కు రూ.15 కోట్ల వ్యయంతో ఉపకాల్వలను ఏర్పాటు చేయాల్సి ఉంది. పైడిపాలెం డిస్ట్రిబ్యూటరీలు, పెద్దకాలువలు, అనుబంధ కాల్వలపై 74 వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. జికెఎల్ఐ డిస్ట్రిబ్యూటరీస్ కింద 20 వేల ఎకరాలు, జికెఎల్ఐ 20 వేల ఎకరాలు, సిబిఆర్ కింద 20 వేల ఎకరాలు, సిబిఆర్ పథకం, పిబిసి కింద 18 ఎత్తిపోతల పథకాల పనులు నత్తనడకన సాగుతున్న విషయం తెలిసిందే. ఏడు ఎత్తిపోతల పథకాల ద్వారా 59,500 ఎకరాల ఆయకట్టుకు నీరం దించాల్సి ఉంది. గ్రావిటీ ద్వారా 24 వేల ఎకరాలకు నీటి సదుపాయ ఉంది. పార్నపల్లి ప్రాంతం నుంచి ఏడు ఎత్తిపోతల పథకాల పనుల్ని పూర్తి చేసింది. ఏడు నుంచి ఐదు ఎత్తిపోతల పథకాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలుస్తోంది. మరో ఆరు ఎత్తిపోతలు ప్రారంభ దశను దాటడం లేదని తెలుస్తోంది. వెలిగల్లు, ఝరికోన, అన్నమయ్య, బ్రహ్మసాగర్ ప్రాజెక్టుల్లో నీటి విడుదలకు నోచుకోని గ్రామాలు ఉన్నాయని తెలుస్తోంది. మైలవరం తాత్కాలిక మరమ్మతులకు రూ.50 లక్షలు కేటాయించింది. ఉత్తర, దక్షిణకాల్వ ఆధునికీకరణ కింద రూ.150 కోట్లకుపైగా కేటాయించాల్సి ఉంది. మైలవరం స్థిరీకరణ ప్రశ్నార్థకంగా మారింది. బ్రహ్మసాగర్ రిజర్వాయర్ కింద 1.77 లక్షల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. 1.27 వేల ఎకరాలకు మాత్రమే నీటి సదుపాయం ఉంది. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ; ఎప్పుడు తెలియడం లేదు. గండికోట ఎత్తిపోతల పథకంలో భాగమైన పిబిసికి, సప్లయ్ ఛానళ్లు లేకపోవడంతో 41 వేల ఎకరాలు, సర్వరాయసాగర్, వామికొండ కింద 24 వేల ఎకరాలు, వెలిగల్లు కింద 24 వేల ఎకరాలు, బ్రహ్మసాగర్ కింద 50 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ప్రశ్నార్థకంగా మారింది.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ళ మణి డిమాండ్ చేశారు. పార్లమెంట్‌మ వేదికగా అమిత్ షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం నాయకులు శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంతకుముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ మీద ఆయన రాసిన రాజ్యాంగం మీద గౌరవం లేని అమిత్‌షాకు రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో కొనసాగే అర్హత లేదని, ఆయన వెంటనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం నేడు 140 కోట్ల భారతీయుల సుఖసంతోషాలకు భరోసాగా నిలిచిందని చెప్పారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు తుడిచిన వాడు భగవంతుడైతే, అంబేద్కర్ కూడా భగవంతుడేనని చెప్పారు. అంబేద్కర్ వల్లే తాను ప్రధాని అయ్యానని చెప్పుకొనే మోడీ, అమిత్‌షా వ్యాఖ్యలపై మౌనం వహించడం సహేతుకం కాదన్నారు. మోడీ వెంటనే స్పందించి, అమిత్ షాను మంత్రి వర్గం నుండి తొలగించి, ఆయన చేత క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిజెపి ప్రజల ఆగ్రహానికి గురై, తగిన మూల్యం చెల్లిం చుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లికార్జున, సుధీర్, నరసయ్య, మణి పాల్గొన్నారు. **కలికిరి:** అంబేద్కర్‌ని ఏకవచనంగా మాట్లాడి, అవమానపరచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల అంబేద్కర్ యువజన సంఘం ఎస్‌సి ఎంప్లాయిస్ అసోసియేషన్ సంఘ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు అధికారభాషా సంఘం మాజీ సభ్యులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్, మండల యువజన సంఘం అధ్యక్షులు జి.శ్రీనివాసులు, ఎస్‌సి ఎంప్లాయిస్ అధ్యక్షులు డి.రవీంద్ర, గౌరవాధ్యక్షులు జి.వెంకటరమణ, ఆగస్తీశ్వర్, ఎం.వెంకటరమణ, మేడిగుర్తి వెంకటరమణ, మల్లయ్య, ఎంప్లాయిస్ అసోసియేషన్ మాజీ అధ్యక్ష కార్యదర్శులు జైరామ్, రాజ్‌కుమార్, కార్యదర్శి ఎ.సిద్దయ్య, జి.హరి, బి.అశోక్, కుమార్, ఆటో హరి, రాజేంద్ర, గోపి, రాంబాబు, బుజ్జి, మాస్ శంకరగిరి, రెడ్డి ప్రసాద్, జెఎసి నాయకులు ఎం.నరేష్, భాను ప్రసాద్, జిఎస్ రాజు పాల్గొన్నారు. **పీలేరు:** అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అనుచితంగా మాట్లాడిన అమిత్ షాను తక్షణం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ డిమాండ్ చేశారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ అంబేద్కర్ సర్కిల్‌లో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు యూసఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి కలెక్టర్ చేయూత



విద్యార్థినికి రూ.లక్ష చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

రెండు కిడ్నీలు పాడైన పేద విద్యార్థినికి కలెక్టర్ అండగా నిలిచారు. ఆర్థిక సాయం చేసి ఆమెకు చేయూత నందించారు. నవంబర్ 27న కలెక్టర్ కె.కె.వి.పల్లి అదర్శ పాఠ శాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని బి.జాహ్నవికి రెండు కిడ్నీలు పనిచేయక వారానికి 3 సార్లు డయాలసిస్ చేసుకుంటూ స్టేజీ-5లో ఉన్న విషయం కలెక్టర్ దృష్టికి వచ్చింది. సదరు విద్యార్థినికి వైద్య సహాయం నిమిత్తం మరిన్ని వివరాలతో కలెక్టరేట్‌లో కలవమని పాఠశాల ప్రిన్సిపల్‌కు కలెక్టర్ సూచించారు. ఈ మేరకు శని వారం మధ్యాహ్నం పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ యండపల్లి బాలాజీ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని జాహ్నవి, తల్లి కాంతమ్మతోపాటు కలెక్టర్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని వివరించారు. వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా తన వ్యక్తిగత నిధుల నుండి రూ.లక్ష చెక్కును విద్యార్థినికి అందజేశారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై తక్షణం స్పందించి మానవత్వంతో గొప్ప మనసు చాటుకుని ఆర్థికంగా సొంత నిధులు సహాయం అందజేసిన కలెక్టర్‌కు విద్యార్థిని, ఆమె తల్లి, పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయ బృందం తమ కృతజ్ఞతలు తెలిపారు. దాతలు సాయం చేసేందుకు ముందుకు రావాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరారు. కార్యక్రమంలో చెన్నూరి బాలాజీ, డాక్టర్ కృష్ణారెడ్డి, పులి శివారెడ్డి, టి.మధు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో విజిలెన్స్ తనిఖీ



బాలికల వసతి గృహంలో తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, ఎస్.బోధిషావలి ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం వారు స్థానిక మదనపల్లి మార్గంలోని బాలికల వసతి గృహాన్ని ఆ వసతి గృహ సంక్షేమ అధికారిణి రమాదేవి సమక్షంలో వారు డార్మెంటరీ, డైనింగ్ హాల్, స్నానపు గదులను పరిశీలిం చారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థినులు ఉపయోగిస్తున్న డార్మెటరీ, డైనింగ్ హాల్ చిన్నపాటి వర్షం కురిసినా ఉరుస్తోందని, స్నానపు గదులకు తలుపులు కూడా లేకపోవడంతో విద్యార్థినులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలను త్వరలో జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు చెప్పారు.



చిన్నారి షేక్ మహమ్మద్‌ను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ఇండియా బుక్ రికార్డ్స్‌లో చిన్నారికి చోటు

- అభినందించిన కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి -రాయచోటి

ఇండియా బుక్ రికార్డ్స్‌లో చిన్నారి చోటు సంపాదించి అవార్డు పొందాడు. ఈనేపథ్యంలో అతన్ని, తల్లిదండ్రులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. రాజంపేట పట్టణం ముకుందారగడ్డకు చెందిన విఆర్‌ఒ షేక్ ముజీబ్, షేక్ మసుద బేగం దంపతుల కుమారుడు షేక్ మహమ్మద్ ముష్కాక్‌సిద్ధిక్ ఏడాదిన్నర వయసులోనే 27 రకాల పండ్లు, కూరగాయలు, జంతువులు, పక్షులు, వృత్తులు, వాహనాలను, స్వాతంత్ర్య సమరయోధులు, మానవుడి శరీరభాగాలు, బొమ్మలు, ఆకారాలను, ఆంగ్ల అక్షరాల అల్ఫాబెట్స్‌ను గుర్తిస్తున్నాడు. జంతువులు, పక్షుల శబ్దాలను గుర్తించడంతో ఇండియా బక్స్ రికాడ్స్ వారు ఇటీవల బాలుడికి అవార్డు జారీ చేశారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ శనివారం వారిని కలెక్టర్ కార్యాలయానికి చిన్నారిని వారి తల్లిదండ్రులను పిలిపించి అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమారుడు చిన్న వయసు నుంచే ఎంతో చలాకీగా ఉంటూన్నాడని, ప్రస్తుతం ఒకటిన్నర సంవత్సరాల వయసులో చురుగ్గా అన్నింటినీ గుర్తిస్తున్నాడని తెలిపారు. చిన్నారి ప్రతిభ పాటవాలను మరింత ప్రోత్సహించాలని భవిష్యత్తులోఉన్నత శిఖరాలు అందుకునేలా బాగా చదివించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

- టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి నాయకులు రాజంపేట అభివృద్ధిని అడ్డుకుంటే సహించమని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు హెచ్చరించారు. శనివారం కూచివారిపల్లె గ్రామ పంచాయతీ, డి.బి.ఎన్.పల్లెలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకుల చర్యల వల్లే ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదని తెలిపారు. నియోజకవర్గంలో అరాచకాలకు పాల్పడితే జైలు పాలు తప్పదని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో పిడికెడు మట్టి కూడా వేయని వైసిపి నాయకులకు ప్రజల్లోకి వచ్చే అర్హత కూడా లేదన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. అంతకుముందు గ్రామంలో పర్యటించిన ఆయనకు టిడిపి నాయకులు పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తూ, బ్యాండు వాయిద్యాల మధ్య అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో క్షత్రియ సంఘం రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, పంచాయతీ సర్పంచ్ మంగమ్మ, ఎంపిటిసి చప్పలి ఖాదర్ బీ, కమ్మ సంఘం సంఘం జిల్లా అధ్యక్షులు శివ నారాయణ చౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇమ్మడికల కుమార్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మాజీ మండల అధ్యక్షులు బాపనయ్య నాయుడు, పోలి చెరువు సంఘం అధ్యక్షులు నాగేశ్వ రరావు నాయుడు, మల్లికార్జున నాయుడు, కమ్మ సంఘం ఉపా ధ్యక్షులు నవీన్ నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి అబూ బకర్, తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధి పరశురాం నాయుడు, మండల ఉపాధ్యక్షులు సతీష్ రాజు పాల్గొన్నారు.



సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న చమర్తి

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్‌టిసి డిఎం బండ్ల కుమార్

ప్రజాశక్తి-పీలేరు

ఎపిఎస్ఆర్‌టిసి అందిస్తున్న కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. కార్గో ఇంటింటి సేవల మాసోత్సవ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన స్థానిక ఆర్టీసీ బస్టాండుకు వచ్చే బస్సుల్లో ఆర్టీసీ కార్గో సేవల గురించి ప్రయాణికులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 ఆగస్టు నుంచి ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 2022 నుండి డోర్ డెలివరీ సౌకర్యాలనకూడా తమ సంస్థ ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ నెల 20 నుండి 2025 జనవరి 29 వరకు ఈ డోర్ డెలివరీ మాసోత్సవాలు చేపడుతున్నామని తెలియజేశారు. రాష్ట్రంలోని 80 ముఖ్య పట్టణాల్లో డోర్ డెలివరీ సౌకర్యం ఉందని, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా ప్రజలు తమ తమ బంధువులు, మిత్రులకు బహు మతులు, దుస్తులు, ఇతరత్రా వస్తువులను పంప డానికి ఆర్టీసీ కార్గో సౌకర్యాలను ఉపయోగిం చుకోవాలని పేర్కొన్నారు. వినియోగదారులు బుక్ చేసే పార్సిల్స్ ఆర్టీసీ కార్గో ద్వారా అతి తక్కువ ఖర్చుతో 24 గంటల లోపు వారి చిరునా మాలకు చేరవేసుకునే సౌకర్యాన్ని పీలేరు పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తమ విలువైన సమయం, డబ్బు వృధా కాకుండా పార్సిళ్లు, కొరియర్ కవర్లు ఆర్టీసీ కార్గో ద్వారా పంపుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఎం వెంట పీలేరు బస్ స్టేషన్ మేనేజర్ బాబు నాయక్ పాల్గొన్నారు.



కార్గో సేవల గురించి ప్రయాణికులకు వివరిస్తున్న డిఎం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పి.వి.రమణ తెలిపారు. శనివారం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.జయలక్ష్మి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హానికలిగితే ప్రపంచంలో ఏర్పడే ముప్పు గురించి విద్యార్థులకు వివరించారు. పరిష్కారం మార్గాలను విద్యార్థులకు క్షుణ్ణంగా బోధించారు. భ్రూణహత్యల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సంస్థ సమన్వయ కర్త పి.శివాజీ, కార్యదర్శి ఎన్.మణి, ఉపాధ్యాయులు శ్రీవాణి విద్యార్థినులు పాల్గొన్నారు.

మైనార్టీ కళాశాలను అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్థానిక తరిగొండ రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ జూనియర్ కళాశాలను మరింత అభివృద్ధి చేస్తామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. కళాశాలలో మంచినీటి సమస్య నెలకొందని ఎమ్మెల్యే దృష్టికి ప్రిన్సిపల్, టిడిపి నాయకులు తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన శనివారం స్థానిక కళాశాలలో ఎంపిడిఒ నిధులతో బోరు వేయించారు. త్వరలోనే సిసి రోడ్లు, లైట్లు వేయించి, కళాశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమామంజుల, టిడిపి నాయకులు సయ్యద్ బాష, పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎమ్మెల్యే తనయుడి పరామర్శ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని మాలేపాడు పంచాయతీ నల్లరాజుగారిపల్లెలో వైసిపి నాయకులు దాడిలో గాయపడిన టిడిపి కార్యకర్తలు రమేష్, గణేష్, చక్రపాణి, వెంకటరమణలను ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ఎమ్మెల్యే తనయుడు జునైద్ అక్బర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పొలంలో జగన్ పుట్టిన రోజు బ్యానర్లు కట్టొద్దన్నందుకు దాడి చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో చిత్తుగా ఓడిన వైసిపి నాయకులకు, కార్యకర్తలకు బుద్ధిరాలేదన్నారు. చేతనైతే మంచి చేయాలే కానీ, రౌడీల్లా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. దాడికి పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఎమ్మెల్యే రాగానే మాలేపాడు పంచాయతీలో పర్యటించి కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరు అధైర్యపడొద్దనిభరోసా కల్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గుర్రప్ప నాయుడు, నాగయ్య, సిద్ధప్ప, రఘుపతి నాయుడు, షంషేర్, బాబా, బొమ్మిశెట్టి పురుషోత్తం, గురునాథ్ యాదవ్, ఖాసీం, మహేష్, డాన్స్ రెడ్డెప్ప, పూలకుంట్ల హరిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వెలుగు'లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమ్మచెరువు మిట్టలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మ దినం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ చెట్టు, అలంకరణ, పశువులపాక ఎంతో ఆకర్షణీయంగా నిలిచాయి. వెలుగు ప్రిన్సిపల్ లీనా కుమారి ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, గీతాలాపనతో అందర్నీ అలరించారు. క్రిస్మస్ వేడుక సందర్భంగా చిన్నారులు కలసి జింగిల్ బెల్స్ పాటకు నృత్యం చేయడం, వెలుగు సిబ్బంది నృత్య ప్రదర్శన ఎంతో ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, వార్డెన్ స్వీటీ, సోషల్ వర్కర్ గీత, వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.



వెలుగు పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

బరితెగింపు

'ప్రజా'దృష్టి

ఉమ్మడి జిల్లాలో ఇసుకాసురుల బరితెగింపు కొనసాగుతోంది. రాజంపేట నియోజకవర్గం నందలూరు మండలం టంగుటూరు ఇసుక రేవు నుంచి రాత్రింభవళ్లు యథేచ్ఛగా ఇసుక తరలింపు సాగిపోతోంది. ఉమ్మడి జిల్లాలోని జమ్మలమడుగు, కమలాపురం, రాజంపేట, ప్రొద్దుటూరు నియోజకవర్గ కేంద్రాలుగా ఇసుకాసురుల చెలరేగిపోతున్నారు. వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడనిదే భూగర్భశోకం తీరదు. ఇసుకాసురుల ఆగడాల వెనుక అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఉన్నారు. గతేడాది జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలంలోని ఓ ఇసుక క్వారీ నుంచి మైనింగ్ నిబంధనలను బేఖాతర్ చేస్తూ సుమారు 10 నుంచి 12 మీటర్ల వరకు గుంతలు తవ్వి ఇసుకను కొల్లగొడుతుండడం దోపిడీకి పరాకాష్ఠగా చెప్పుకోవచ్చు. జిల్లాలో నిత్యం అక్రమ రవాణా సాగిపోతోంది. రాష్ట్రంలో ఎవరు అధికారం చేపట్టినా ప్రకృతి వనరులను చెరపట్టి కొల్లగొట్టి భారీగా సొమ్ము చేసుకునే యజ్ఞం పదేళ్లుగా సాగిపోతోంది. ఇసుక, మట్టి, ఎర్రచందనం, భూకబ్జాలను వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. రెండేళ్ల కిందట జిల్లా పరిషత్ కార్యాలయంలో నీటి వనరులపై రచించిన పుస్తకావిష్కరణ సభలో ఓ రిటైర్డు జస్టిస్ ఇసుకను కొల్లగొట్టడం వల్ల నీటి వనరుల లభ్యతపై పెనుప్రభావం పడుతుందని పట్ల ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. మేధావులు, బుద్ధిజీవుల నుంచి హెచ్చరికలు, ఆందోళనలు వినిపిస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం ఆందోళనకరం. ఆకులు కాలిన తర్వాత చేతులు పట్టుకున్నా ఉపయోగం ఉండదనే హితవు చెవికి ఎక్కడం లేదు. అంతులేని ధన దోపిడీకి కళ్లెం వేయాల్సిన తరుణం ఆసన్నమైందని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలోని మేధావులు, బుద్ధిజీవులు, విద్యావంతుల్లో చలనం రావాల్సిన అవసరం ఉంది. ఉత్తముల మౌనం వల్ల సమాజానికి తీవ్ర హాని జరుగుతుందనే అంశాన్ని గ్రహించాల్సిన అవసరం ఏర్పడింది. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల దోపిడీకి హద్దు పద్దూ లేకుండా పోతుంది. ప్రజాప్రతినిధులు, అనుచరుల రూపంలో ఇసుకాసురులు ఉండడం వల్ల జిల్లాకు చెందిన అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వమే ప్రకృతి వనరులకు వాటిల్లుతున్న హానిపై స్పందించాల్సిన అవసరం ఉరుముతోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



పారిశుధ్య పనుల్లో కార్మికులు

నగర పంచాయతీ కార్యాలయాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కమిషనర్ జివి.పల్లవి ఆధ్వర్యంలో ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు కార్మికుల తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ కార్యాల యాలతో పాటు నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తాచెదారాన్ని శుభ్రం చేసి మొక్కలను నాటారు. ప్రభుత్వ కార్యాల యాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలకు మంచి సంకేతాలు వెళతాయన్నారు. ఈ బాధ్యతలను నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, నగర పంచాయతీ ఎఇ రాజేం దర్‌లకు అప్పగించడం జరిగిందన్నారు. స్వచ్ఛ సంకల్పం, క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో నిర్విరామంగా పారి శుధ్య పనులు నిర్వహి స్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడం, అంటువ్యాధులు ప్రబలుతుడటంతో పారిశుధ్య పనులను మరింత వేగవంతం చేయడం జరిగిందన్నారు. పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.



వైసిపి నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

కూటమి పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

కూటమి పాలనలో ప్రజాస్వామ్యని అపహాస్యం చేస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన స్వగృహంలో వైసిపి నాయకులతో జగన్ జన్మదిన వేడుకల్లో జరిగిన సంఘటనపై చర్చించారు. మాజీ ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను కూడా పోలీసుల ద్వారా అడ్డుకోవడం నీచమైన చర్యని అన్నారు. అనుమతులు లేనిదే ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్ట రాదని, కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకోకూడదని పోలీ సుల ద్వారా హెచ్చరించడం, నాయకులపై కేసులో పెడతామని భయకం పితులను చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఇదేనా ఇలాంటి దుశ్చర్యలతో పాలన సాగించడం అని ప్రశ్నించారు. భవిష్యత్తులో ప్రజలే కూటమి పాలకులకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేజిక్కించుకొని అధికార బలంతో ప్రజలను అన్ని వర్గాల వారిని మోసం చేశారని అన్నారు. ఇటువంటి దుష్పరిపాలన చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకుంటున్న న్యాయవాదులు

ఇద్దరు న్యాయవాదులకు 'మీడియేటర్' సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్ అలీ, సెక్రటరీ సుబ్బరామయ్యలు ఎపి స్టేట్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, ఎపిహైకోర్టు జడ్జి నరేందర్ చేతుల మీదుగా మీడియేషన్‌లో మీడియేటర్ సర్టిఫికెట్లను అందుకున్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఎపి స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారీ ఆద్వర్యంలో మొట్టమొదటిసారిగా కడప జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ నిర్వహించిన మీడియేటర్ (మధ్యవర్తిత్వం) ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ మొహమ్మద్అలీ మాటాడుతూ తమకు శిక్షణ ట్రైనర్‌లుగా బీన దేవరాజ్ కర్ణాటక, డాక్టర్ పద్మ తమిళనాడు వ్యవహరించినారని తెలిపారు. జిల్లా జడ్జిలు ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లు అందించారు. మీడియేటర్లకు రాబోవు జ్యుడీషియల్ వ్యవస్థలో వీరి పాత్ర కీలకమని అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కాలా హరణం లేకుండా, సివిల్, క్రిమినల్ కేసులు రాజీ మార్గంలో లిటిగెంట్ల మధ్య సోదర, సౌభ్రతత్వం భావం ప్రేరణ కలిగి సౌలభ్యంగా కేసులు సత్వర పరిష్కార మయ్యేదానికి అవకాశం సుగమం కాగలదని అన్నారు.

కూటమి పాలనలో రాష్ట్రం అప్పల కుప్ప

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అప్పుల విషయంలో కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకినట్లుంది చంద్రబాబు పాలనా తీరు అని విమర్శించారు. వైసిపి పాలనలో రాష్ట్రం అప్పుల కుప్ప అయిందని చెప్పారని గుర్తు చేశారు. వైసిపి అధికారం కోల్పోయే నాటికి రాష్ట్ర అప్పు దాదాపు రూ.10 లక్షల కోట్లు అన్నారు. వైసిపి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని టిడిపితో సహా అన్ని పార్టీలు గతంలో విమర్శించాయని తెలిపారు. నేడు టిడిపి కూటమి ప్రభుత్వం అదే పని చేస్తోందని, అంతకంటే ఎక్కువ అప్పులను చేస్తున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి 7 నెలల్లోనే కూటమి ప్రభుత్వం రూ.59 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 91,443 కోట్ల అప్పు చేస్తామని బడ్జెట్‌లోనే పేర్కొందని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం కేంద్రం నుండి నిధులు తెప్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అమరావతికి అప్పు తెచ్చుకోవడం ఘన కార్యమైనట్లు ఫోజు కొట్టడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పులు చేయడం తగ్గించి, చట్ట ప్రకారం కేంద్రం నుండి గ్రాంటు రూపంలో నిధులు తెప్పించాలని తులసిరెడ్డి చంద్రబాబు ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, ఉత్తన్న, బాలం మాష్ పాల్గొన్నారు.

ప్రపంచ గణిత మేధావి రామానుజన్



రాజంపేట :రామానుజన్‌కు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని రాజు హైస్కూల్‌లో ముందస్తు జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణితంకు సంబంధించి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పాఠశాల సిఇఒ జి.రఘురామరాజు, ప్రధానోపాధ్యాయులు వీ.మోహన్‌రెడ్డి, ఇన్‌ఛార్జ్ ఎస్‌ఎండి.హబీబ్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా గణితంపై మక్కువ చూపితే గణితం సులువుగా అర్థం అవుతుందని తెలిపారు. విశ్లేషణాత్మకంగా గణితం నేర్చుకోవాలని వారు విద్యార్థులకు సూచించారు. గణితంలో ప్రావీణ్యం సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గణితం ఉపాధ్యాయులు బాల గంగాధర్ నాయుడు, అంకయ్య, జయప్రకాష్, వెంకటేష్, జీ.లక్ష్మి, సునీల్ కుమార్ రెడ్డి, సుప్రియ పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని టి.కమ్మపల్లి జడ్పి హైస్కూల్‌లో శనివారం ముందస్తుగా జాతీయ గణిత దినోత్సవాన్ని గణిత ఉపాధ్యాయులు శామీర్ హుస్సేన్, గిరిధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి హెచ్‌ఎం బబిత అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఇఒ చక్రధర రాజు పాల్గొన్నారు. శ్రీనివాస రామానుజన్ చిత్రవ టానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లా డుతూ సంఖ్యాశాస్త్రంలో శ్రీనివాసరామానుజన్ కృషి ఎనలేనిదని కొని యాడారు. గణిత శాస్త్రం లేకుండా ప్రపంచం ఏ రంగాల్లోనూ రాణించ లేద న్నారు. దైనందిన జీవితంలో గణితం లేకుండా మానవుల మనుగడ కష్టమ న్నారు. విద్యార్థులు తయారుచేసిన గణిత ప్రదర్శనలు తిలకించి అభినందిం చారు. కార్యక్రమంలో పాఠశాల పాఠశాల చైర్మన్ పి.నాగేశ్వర్, కో-ఆప్షన్ నెంబర్ చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యాయులు రమణారెడ్డి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు, ఆసిఫ్‌బాషా, హేమలత, శేషాద్రి, ప్రమీల, ప్రమీలకుమారి పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** ప్రపంచ గణిత మేధావి రామానుజన్ అని ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం బాపూజీ పురపాలక ఉన్నత పాఠశాలలో ప్రపంచ గణిత మేధావి రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, క్విజ్ ప్రోగ్రామ్స్, డ్రాయింగ్ కాంపిటీషన్స్ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు మదనపల్లె ఎంఇఒ ప్రభాకర్ రెడ్డి, నిమ్మనపల్లి ఎంఇఒ పద్మావతి బహుమతులు పంచి పెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘు, ఉపాధ్యాయులు ముర శీమోహన్, మేఘన, రహమాన్, విద్యార్థులు **చిన్నమండెం :** మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో గణితంకు సంబంధించి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ నరసింహులుపూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అ గణిత అధ్యాపకులు శ్రీనివాసులు, శివరామకృష్ణ, ఆరిఫ్ లు మాట్లాడుతూ అతి చిన్న వయసులో అపరిష్కృత సమస్యలను అవలీలగా సాధించి,గణిత శాస్త్రజ్ఞులలో పేరు పొందిన భారత గణిత మేధావి రామానుజం అని కొనియాడారు.ఎన్ఎస్ఎస్ పిఒ నవీన్ కుమార్, సుబ్బరాయుడు మాట్లాడుతూ మ్యాజిక్ సంఖ్య 17 29ను రామానుజన్ సంఖ్యగా అభివర్ణించారు. **మదనపల్లె అర్బన్ :** స్థానిక 14వ వార్డులో కౌన్సిలర్ షేక్ షబానా ఆధ్వర్యంలో మాజీ సిఎం వై.ఎస్.జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి అందరికీ పంచి పెట్టారు. నియోజక సమన్వయ కర్త నిస్సార్ అహ్మద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజరెడ్డి, వైస్ ఛైర్మన్ జింకా వెంకటా చలపతి, కౌన్సిలర్లు రేణుక, ఈశ్వర్‌నాయక్, కో-ఆప్షన్ మెంబర్ స్వెటర్ శారదారెడ్డి, సీనియర్ నాయకులు బాబ్జాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

ఘనంగా మాజీ సిఎం జగన్ జన్మదిన వేడుకలు



రాయచోటి: కేక్ తినిపించుకుంటున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణంలోని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. జెడ్‌పిటిసి వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలసి భారీ కేక్‌కట్ చేసి జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలిమి చాన్‌బాషా, గౌస్‌ఖాన్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, సుగవాసి శ్యామ్, ఫయాజ్ అహమ్మద్, రియాజ్, జానం రవీంద్ర యాదవ్ కో-ఆప్షన్ అయ్యావారు రెడ్డి, మాజీ కో-ఆప్షన్ జాఫర్‌అలీఖాన్, చిన్న సంజీవయ్య పాల్గొన్నారు. **కలకడ:** మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన కలకడ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కోట గుడిబండ పంచాయతీ ఎల్లంగుడిబండలో శెట్టిపల్లి చిన్నపాప ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి జన్మదిన వేడు కలను ఘనంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. వైసిపి నాయకులు, కార్యక ర్తలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** మాజీ సిఎం జగన్ జన్మదిన వేడుకలను పట్టణంలోని కొండ కాంప్లెక్స్‌లో ద్వారకన్న యువ సేన సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించుకున్నారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. నాయకులు కంచి బలరాంరెడ్డి, సి.ఆర్ చిన్నికృష్ణ, కంచి కళ్యాణకుమార్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, హరి, వైస్ ఎంపిపి ఖాదర్‌వలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పుల్లంపేట :**మండల పరిధి లోని జాగువారిపల్లి గ్రామంలో జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు వెలకచర్ల రమణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. **వీరబల్లి :** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని సీనియర్ వైసిపి నాయకుడు ధర్మారెడ్డి, వీర నాగిరెడ్డి స్వగృహంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు మధ్య కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి పెట్టుకున్నారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి, వీర నాగిరెడ్డి, సర్పంచులు నాగిరెడ్డి, గోపీనాథ్ రెడ్డి, జడ్పిటిసి శివరాం గౌడ్, ఎంపిటిసి పురుషోత్తంరెడ్డి, సింగిల్‌విండో అమర్నాథ్‌రెడ్డి, ఈశ్వరయ్య, నరసింహులు పాల్గొన్నారు. **రామాపురం :**మండల వ్యాప్తంగా మాజీ సిఎం జగన్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో మండల మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా, కతీఫ్ బేగ్, మహేష్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. చిట్లూరులో మాజీ ఎంపిటిసి హరినాథ్ రెడ్డి, మాజీ ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యుడు శివశంకర్, రాచపల్లి మాజీ సింగల్ విండో అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, మాజీ డీలర్ చలమారెడ్డి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. **సుండుపల్లి :** పట్టణంలోని వైసిపి మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల నాయకులు అజయ్‌రెడ్డి, రెహ మాన్‌ఖాన్ , రహీం భాషా, కలీం బాషా, నాయకులు, కార్యకర్తలతో కలసి భారీ కేక్ కట్ చేసి జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జడ్‌పిటిసి స్మైల్ యూసుఫ్, మైనార్టీ నాయకులు అబ్దుల్లా, మజ్జు పాల్గొన్నారు. **రామసముద్రం :** మాజీ సిఎం జగన్ జన్మదిన వేడుకలను మండలంలోని చెంబకూరు కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పండ్లు, పంపిణీ చేశారు. కార్యక్ర మంలో మాజీ సింగల్ విండో అధ్యక్షులు కేశవరెడ్డి , ఎంపిపి సుందరం కుసుమకుమారి, వైస్ ఎంపిపి రమణా రెడ్డి, మాజీ ఎంపిటిసి దొడ్డిపల్లి ఆనంద్ పాల్గొన్నారు. **కలికిరి:** వైఎస్.జగన్ జన్మదిన వేడుకలను మాజీ మార్కె పేడ్ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జననేత జగన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలి పారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జుబేర్ అహ్మద్, జునేద్ అహ్మద్, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మహల్ సర్పంచ్ రియాజ్, అద్దవా రిపల్లి సర్పంచ్ గంగయ్య, హనీఫ్, రత్న శేఖర్ రెడ్డి, వేంపల్లి ఫయాజ్, వేంపల్లి బావాజీ పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల కేంద్రమైన చిన్నమండెంలో మాజీ సిఎం జగన్ జన్మదిన వేడుకలను జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవ నాథరెడ్డి కేక్ కట్ చేసి నిర్వహించారు.ఈ సందర్భంగా అజయ్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. మాజీ సిఎం జగన్ పేదల జీవితాల్లో వెలుగులు నింపారనిఅన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపా ధ్యక్షుడు ఎజాష్ అలీ ఖాన్,జేసి ఎస్ మండల కన్వీనర్ చుక్క అంజనప్ప, కో- ఆఫషన్ మెంబర్ గౌష్ సాబు, ఎంపిటిసిలు శ్యామ్, శ్రీరాములు, రమణ, సర్పంచ్‌లు, ముసల్ రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, రామమూర్తి పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :**మాజీ సిఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంచి పెట్టారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలతో పూజలు చేసి ఘనంగా నివాళులర్పిం చారు. బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం, కేకులు కట్ చేయకూడదని పోలీ సులు చెప్పడం దారుణమని వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, రామ్మూర్తి, మైనుద్దీన్ పాల్గొన్నారు. **పీలేరు:** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పీలేరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక పిఎల్ఆర్ అపార్ట్ మెంట్ వద్ద వైసిపి శ్రేణులు భారీ కేక్ కత్తిరించి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా వైసిపి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మాజీ ముఖ్యమంత్రి జగన్మహన్ రెడ్డి జన్మదిన వేడుక జరిపి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్ర మంలో మండల పార్టీ కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి, జడ్‌పిటిసి ఎటి రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా, కాలనీ చిన్న, విక్టరీ వెంకట రమణారెడ్డి, మహిత ఆనంద్, పెద్దోడు, గుండ్లూరు జయరామచంద్రయ్య, పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక వైసిపి కార్యాలయంలో జడ్‌పిటిసి నిర్మల ఆధ్వ ర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం దివంగత ముఖ్య మంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చింతల శివా నందరెడ్డి, సర్పంచ్ గంగులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, ఉప సర్పంచ్ కేశవరెడ్డి, అబ్దుల్ కలీమ్ పాల్గొన్నారు.



సుండుపల్లి :కేక్ కట్ చేస్తున్న అజయ్‌రెడ్డి

పారుడు వ్యాధి నివారణకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-వీరబల్లి

మూగజీవాల్లో పారుడు వ్యాధి నివారణకు గ్రామాల్లో ఉన్న గొర్రెలు, మేకలు, పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వ్యాక్సిన్ వేస్తారని పశుసంవర్ధక శాఖ డిడి మాల కొండయ్య తెలిపారు. శనివారం 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమంలో భాగంగా తాటి గుంటపల్లి, ఓదువీడు గుర్రప్పగారిపల్లి, సానిపాయి, గ్రామాల్లో ఫిజికల్ వెరిఫికేషన్ చేసి అనంతరం తాటి గుంటపల్లిలో 750 గొర్రెలు, మేకలకు, వెటర్నరీ అసిస్టెంట్ ఆంజనేయులు వ్యాక్సిన్ వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉదయాన్నే వెళ్లి గొర్రె, మేక పిల్లలకు టీకాలు వేయాలన్నారు. 2నెలల నుంచి ఏడాది వయసున్న గొర్రెలు, మేకల పిల్లలకు వైరస్ వల్ల పుర్రురోగం, పారుడురోగం, పిపిఆర్ వస్తాయ న్నారు. వ్యాధి సోకిన జీవాల్లో తీవ్ర జ్వరం, ముక్కు నుంచి నీరు కారడం, కండ్లలో ఊసులు తోడి ఎర్రగా మారుతాయన్నారు. పిల్లలు బలహీనంగా మారుతాయన్నారు. జీవాలు మేత మాని ఐదారు రోజుల్లోనే చనిపోయే ఆస్కారం ఉందన్నారు. గొర్రెలు మేకల పెంపకందారులందరూ పశువైద్య సిబ్బందికి సహకరించి ఉచిత పారుడు వ్యాధి పిపిఆర్ నివారణ టీకాలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో వెట్టనరీ డాక్టర్ విజయ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ ఆంజనేయులు, టిడిపి నాయకులు భాస్కర్ రాజు, దుర్గం ఆంజనేయులు, చంద్రబాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



సమాఖ్య సభ్యులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వెలుగు సమాఖ్యలో ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని సమాఖ్య కార్యాలయంలో శనివారం రాయచోటికి చెందిన అగర్వాల్ ఐ ఆస్పత్రిలో ఆధ్వర్యంలో 52మంది మహిళలు, వెలుగు సిబ్బందికి ఉచితంగా కంటి పరీక్ష చేశారు. డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ మహమ్మద్ అఫ్నాన్ ఆధ్వర్యంలో పరీక్షించి కొందరికి కంటి అద్దాలను మరి కొందరిని ఆపరేషన్‌కు రెఫర్ చేశారు కార్యక్రమంలో ఎపిఎం రెడ్డమ్మ, సిసిలు అంజనీదేవి, రెడ్డెన్న, నాగరాజ, సుధామని, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ హరికుమార్

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ హరికుమార్ తెలిపారు. శుక్రవారం ఎర్రసానిపల్లెలో రెవెన్యూ సదస్సు జరిగింది.ప్రజలు రెవెన్యూ రికార్డులలో సవరణల కొరకు 5అర్జీలు, ఆఫ్‌లైన్ అర్జీ ఒకటి, మొత్తం ఆరు అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ పేర్కొన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్జీదారులకు రశీదులు అందించినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.పజలు భూ సమస్యలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు శ్రీకారం చుట్టిందని అన్నారు. 45 రోజుల పాటు జరిగే రెవెన్యూ సదస్సులకు ప్రజలు అర్జీ రూపంలో తమ సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఇకనుంచి భూ సమ స్యలపై భాదితులు కార్యాలయాల చుట్టూ తిరగడం కాకుండా అధికారులే ప్రజల వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించాలని ఉద్దేశంతో మీభూమి- మీహక్కు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఫ్రీ హోల్డ్, మ్యుటేషన్, 22ఎ,డికెటి రీ సర్వే, ఇతర రెవెన్యూ సంబంధిత అంశా లపై వినతులు స్వీకరించి బాధితులకు న్యాయం చేయడం జరుగుతోందన్నారు. బాధితులు తమ సమస్యలు అర్జీ రూపంలో తెలియజేసి రశీదు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారి జోగేంద్ర, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామ్‌రాజ్, ఆర్ఐ మొద్దు కృష్ణ యాదవ్, దేవాదయ శాఖ కొండ కిట్ట, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'మిట్స్'లో 'ది సర్వర్‌లెస్ రెవల్యూషన్'పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మాస్టర్ అఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ వారు ' ది సర్వర్‌లెస్ రెవల్యూషన్' పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుచిరాపల్లిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వినయ్‌రాజ్ పాల్గొన్నారని తెలిపారు. కార్యకమం లో ఆయన మాట్లాడుతూ మోనోలిత్స్, మైక్రోసర్వీసెస్, మోడరన్ ఆర్కిటెక్చర్స్ పై విద్యార్థులకు క్షుణంగా వివరించారని అన్నారు. మనం ఒక వెబ్ పేజీని తయారు చేయుటకు మోనోలిత్స్ ఆర్కిటెక్చర్ అవసరమని, ఈ వెబ్ పేజీలో వివిధ మోడ్యూల్స్‌ను తయారుచేయుటకు ఈమైక్రోసెర్విస్ ఆర్కిటెక్చర్స్ అవసరమని అన్నారు.ఇటీవల, అమెజాన్ ఒక కేస్ స్టడీని పంచుకుందని, ఇది మైక్రోసర్వీసెస్ అనుసరించడం ద్వారా వారు 90శాతం ఖర్చును ఎలా ఆదా చేశారో హైలైట్ చేసిందన్నారు. కొన్ని సంస్థలు మైక్రోసర్వీస్‌లను స్వీకరించడం ద్వారా మౌలిక సదుపాయాల ఖర్చులపై 30 శాతం వరకు ఖర్చు ఆదా చేసినట్లు కూడా నివేదించాయని అన్నారు. ఆధునిక సాంకేతిక ల్యాండ్‌స్కేప్‌లో సర్వర్‌లెస్ కంప్యూటింగ్ పరివర్తన సామర్థ్యాన్ని విద్యార్థులకు వివరించారు. సర్వర్‌లెస్‌తో, క్లౌడ్ విక్రేత ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్ చేయడం, భద్రతను నిర్వహించడం, సిస్టమ్ పర్యవేక్షణ, ప్రణాళికా సామర్థ్యంతో సహా అన్ని సాధారణ మౌలిక సదుపాయాలను ఇందులో ఉంటాయని ఆయన అన్నారు. ఈ టెక్నాలజీ పై మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని విద్యార్థులు వీటిపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ నవీన్‌కుమార్, కో-ఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ వినయ్‌రాజ్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



ప్రకాష్ (ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి కురుబలకోట మండలంలో జరిగింది. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కథనం మేరకు.. మదనపల్లె పట్టణం రామారావు కాలనీ చెందిన రామ్మోహన్ కుమారుడు ప్రకాష్(20), సిద్ధప్ప కుమారుడు శ్రీనివాసులు అంగళ్లు లోని ఓ బార్బర్ షాప్‌లో పనులు చేసుకుంటూ జీవనం చేసేవారని తెలి పారు. యథావిధిగా శుక్రవారం పనులకు వెళ్లిన ఈ ఇద్దరు రాత్రి పది గంటల తర్వాత ద్విచక్ర వాహనంలో అంగళ్లు నుంచి మదనపల్లెకు బయలుదేరారని చెప్పారు. మార్గమధ్యంలోని విశ్వం కళాశాల బైపాస్ రింగురోడ్డు వద్ద గుర్తుతెలి యని వాహనం వీరిని ఢీకొని వెళ్లిపోయిందన్నారు. ఈ ప్రమాదంలో ప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. గమనించిన స్థానికులు బాధితుడిని 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. పరీక్షించిన వైద్యులు బాధితునికి ప్రథమ చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. షాపులో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్న కుమారుడు ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో కుటుంబంలో విషాద అలముకుంది. ప్రకాష్ మృతితో రామారావు కాలనీలో విషాదం అలముకుంది.